పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ, మే 24 (నమస్తే తెలంగాణ) : ఈనెల 25న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషాతో మాట్లాడారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని సూచించారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సీల్ చేసి జేఎన్టీయూహెచ్‌కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన తాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఇన్విజిలేటర్లను నియమించాలని, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వాచీలు తీసుకురావద్దన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్రామ పాలన అధికారి పరీక్ష ను నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, కలెక్టరేట్ ఏవో మన్సూర్ పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చుపెడుతున్న కడియం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

లింగాలఘనపురం, మే 24 : దళితుల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆదివారం మండల కేంద్రంలో జరిగే దళిత ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించడం సిగ్గు చేటని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. దళితులకు ఎంతో మేలుచేస్తున్నామని చెప్పే కాంగ్రెస్ పార్టీ మాదిగలను అణగదొక్కుతోందన్నారు. రాష్ట్రంలో దళితులకు రిజర్వ్ చేసిన మూడు ఎంపీ సీట్లలో మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించలేదని విమర్శించారు. కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలువాలని వారు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మబ్బు కరుణాకర్, ఉడుగుల భాగ్యలక్ష్మి, గట్టగల్ల శ్రీహరి, గాదెపాక విష్ణు, నల్ల రాహుల్, ఎర్ర కుయారస్వామి, నల్ల కుమార్, నల్ల విజయ్, చింత వెంకటేశ్ పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లను వినియోగించుకోవాలి

కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తున్న అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, మే 24 : కాటమయ్య రక్షణ కవచం కిట్లను కల్లు గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి బీ రవీందర్ కోరారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల్లోని పలు గ్రామాల్లో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందించారు. కిట్లను ఉపయోగించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, ఎస్సై సుధా మాధురి, జిల్లా కోఆర్డినేటర్ బాల్నె వెంకట మల్లయ్య, ట్రైనర్స్ కుర్ర ఉప్పలయ్య, మాచర్ల రఘురాములు, జూనియర్ అసిస్టెంట్ ఇర్ర కుమారస్వామి, శేఖర్. గడ్డం సురేశ్, గడ్డం రాజు, మెరుగు నర్సింగం, మండల గౌరవాధ్యక్షులు గట్టు రమేశ్, టీసీఎస్ అధ్యక్షులు గట్టు ఉప్పలయ్య, కోరుకొప్పుల రాజు, పూజారి యాకయ్య. భిక్షపతి, బొంగోని రాజు, రంగు ప్రభాకర్, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..

- జిల్లాకు అవసరమైన పుస్తకాలు 2,78,310
- ఇప్పటి వరకు చేరినవి 2,14,460
- విద్యాశాఖ గోదాము నుంచి స్కూళ్లకు పంపిణీ

జనగామలోని గోదాము వద్ద పాఠ్యపుస్తకాలతో విద్యాశాఖ అధికారులు

జనగామ, మే 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు కొత్త విద్యా సంవత్సరానికి 15 రోజుల ముందుగానే మొదటి విడతగా జిల్లా కేంద్రానికి చేరాయి. ప్రస్తుతం వీటిని ఇక్కడి నుంచి మండల కేంద్రాలకు విద్యాశాఖ అధికారులు పంపుతున్నారు. అయితే మొదటి విడుతగా జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి మండల కేంద్రాలకు చేరుతున్నాయి. యూడైస్ ప్లస్ వివరాల ప్రకారం మొత్తం 2,78,310 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇందులో పార్టు-1 కింద 2,14,460 పుస్తకాలు గోదాముకు చేరాయి. పార్టు-2లో వర్క్‌బుక్స్, వర్క్ షీట్లు, స్టూడెంట్ వర్క్‌షీట్స్ వంటి పుస్తకాలు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత వచ్చే అవకాశం ఉంది. కొడకండ్ల, చిల్పూరు, లింగాలఘనపురం మండలాలు మినహా మిగతా తొమ్మిది మండలాలకు 1,23,200 పుస్తకాలను ఇప్పటికే ఆయా మండల విద్యాశాఖ అధికారుల ద్వారా పంపిణీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్, టీఎస్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్, మైనార్టీ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో బోధిస్తున్నారు. వీరికోసం ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తుండగా ప్రతీ ఏటా పాఠశాలల ప్రారంభానికి ముందే పార్టు-1, పార్టు-2లుగా విభజించి పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలయ్యే నాటికి పుస్తకాల పంపిణీ పూర్తి చేయడంతోపాటు పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై వరుస సంఖ్యలను ముద్రించడం ద్వారా ఎన్ని మండలాలకు ఏయే పాఠశాలలకు పుస్తకాలు అందాయనే విషయమై రికార్డు చేస్తున్నారు. 1నుంచి 10 తరగతుల విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో ఒకవైపు తెలుగు, ఇంకో వైపు ఆంగ్ల మాధ్యమంలో పాఠాలను ముద్రించారు. 3 నుంచి 10 తరగతుల వారికి పార్టు-1, పార్టు-2 పంపిణీ చేస్తుండగా, ఈ విధానం ద్వారా విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గి పుస్తకాల్లోకి ప్రతిపాఠానికి బార్‌కోడ్ ముద్రించడంతో ఫోన్‌లో స్కాన్ చేస్తే ఆ పాఠాన్ని వీడియో రూపంలో కూడా చూసుకోవచ్చు. ఇప్పటికే దేవరుప్పుల మండలానికి 7,385, నర్మెట 7,776, బచ్చన్నపేట 10,745, జనగామ 28,645, తరిగొప్పుల 4,377, జఫర్‌గఢ్ 12,822, స్టేషన్‌ఘన్‌పూర్ 23,920, రఘునాథపల్లి 11, 380, పాలకుర్తి మండలానికి 16,150 పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియంలో టెక్ట్స్‌బుక్స్ ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వమే విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందిస్తుండడంతో ప్రైవేట్ సంస్థలు ముద్రణ తగ్గించాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పుస్తకాలు ప్రైవేట్‌లో కొనాలంటే తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతున్నది. ఉదాహరణకు ప్రైవేట్‌లో ఆరో తరగతి పుస్తకాలు కొనాలంటే దాదాపు రూ.1,000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి విడుతల వారీగా పాఠ్యపుస్తకాలు రానుండగా, ఇప్పటికే పుస్తకాలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ గోదాములో భద్రపరిచారు. మిగిలిన అన్ని పుస్తకాలు పాఠశాలలు తెరిచే నాటికి జిల్లాకు చేరుకుంటాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎల్ ఆర్ఎస్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ, మే 24 (నమస్తే తెలంగాణ) : పురపాలక సంఘం పరిధిలో లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ ఆదేశించారు. శనివారం జనగామ మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాల వారీగా అధికారులు, సిబ్బంది పనితీరు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్లియరెన్స్, ఆస్తి పన్నుల వసూళ్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ వార్డుల్లో చెత్త సేకరణ పాయింట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ చెత్త తరలింపు జరిగే ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. డ్రైనేజీలు, రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణను మరింత మెరుగ్గా నిర్వహించాలని, కాల్వల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు క్రమం తప్పకుండా జరగాలని పింకేశ్‌కుమార్ కోరారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. పురపాలికకు సంబంధించిన రిజిస్టర్లు, సెక్షన్ల వారీగా రికార్డులు, ఖాతాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయా వార్డుల వారీగా నివాస గృహాల నుంచి వసూలు చేసిన పన్నుల వివరాలపై ఆరా తీసిన ఆయన వంద శాతం వసూళ్ల లక్ష్యంగా ముందుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ గోపయ్య, ఆర్వో శ్రీనివాస్‌స్వామి, టీపీఎస్ ప్రశాంతి పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులతో డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం

నర్మెట, మే 24: మండలంలోని వెల్దండలో మల్లారెడ్డి నారాయణ మల్లీ స్పెషాలిటీ హాస్పిటల్ నేతృత్వంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 70 మందికి వివిధ పరీక్షలు, శస్త్ర చికిత్స కోసం ఆదివారం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లనున్నట్లు వైద్య బృందం సభ్యులు తెలిపారు. శిబిరాన్ని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు వంగ ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రతినిధి వంగ రవి, బీజేవైఎం నేత బొల్లం అవినాష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బచ్చన్నపేట, 24 మే : కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దుబ్బగుంటపల్లిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బగుంటపల్లికి చెందిన దండు సిద్ధులుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు దండు కిష్టయ్య(37)కు 2007లో కవితతో వివాహం జరిగింది. అప్పటి నుంచి కిష్టయ్య భార్యతో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన శనివారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని స్థానిక ఎస్సై హమీద్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలెక్టర్ ఆదేశాల మేరకే ఇసుక తరలింపునకు అనుమతులు

దేవరుప్పుల తహసీల్దార్ అండాలు

దేవరుప్పుల, మే 23: జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకే మండల కేంద్రంలోని వాగు నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నట్టు తహసీల్దార్ అండాలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ పనులకు ఇసుక పర్మిట్లు ఇస్తున్నట్టు అండాలు తెలిపారు. మూడు మండలాల్లో 191 ఇండ్లకు 2,614 ట్రాక్టర్ల ఇసుకను తరలించేందుకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఒక్కో ఇంటికి 14 ట్రాక్టర్ల ఇసుకను ఇందించాలని ఆదేశాలుండగా, దేవరుప్పుల మండలంలోని లకావత్ తండాలో 40 ఇండ్లకు 560 ట్రాక్టర్లు, కొడకండ్ల మండలం నెల్లిబండ తండాలో 46 ఇండ్లకు 644 ట్రాక్టర్లు, పాలకుర్తి మండలం తీగారంలో 105 ఇండ్లకు 1470 ట్రాక్టర్ల ఇసుకను దేవరుప్పుల, కోలుకొండ వాగుల నుంచి తరలించనున్నట్లు ఆమె తెలిపారు. ఇవికాక మండలంలోని ఆయా గ్రామాల్లో స్థానిక అవసరాలకు ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా ఇంత పెద్ద ఎత్తున ఇసుకను వాగు పరివాహక గ్రామాల నుంచి తరలిస్తే భూగర్భ జలాలు ఉండవని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే దేవరుప్పుల మండలాన్ని ప్రభుత్వం డార్క్ ఏరియాగా ప్రకటించగా ఇసుక తరలింపు అనుమతులు ఇవ్వొద్దని అధికారులు అప్పట్లోనే తెలిపారని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా చందునాయక్

స్టేషన్ ఘన్‌పూర్, మే 24 : రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకుల డిపాజిట్లలో 18 శాతం నిధులను రైతులకు పంట రుణాలుగా ఇవ్వాలని, ఈ విషయమై వచ్చే నెల 5, 6 తేదీల్లో బ్యాంకుల ఎదుట నిర్వహిస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు కోసం వచ్చే నెల 11న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం డివిజన్ కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చందునాయక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీల అమలుకోసం నిర్వహించే ధర్నాల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, పసల్ బీమా యోజన పథకాన్ని రైతులకు అనుకూలంగా మార్చాలన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి రూ.10 వేలకు పెంచాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, మార్కెట్ ముసాయిదా చట్టాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అన్ని పంటలకు క్వింటాకు రూ.వెయ్యి చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ భీరయ్య, రమావత్ మీట్యా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు బోడ రాములు, గండి అంజయ్య, నక్క యాకయ్య కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మోదీ పాలన

బచ్చన్నపేట, మే 24 : కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని రాజు విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపర్చాలని, వారిని పోరాటాల్లోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్, మండల కమిటీ సభ్యులు రావుల రవీందర్‌రెడ్డి, బండకింద బాలనారాయణ, రాజు, పర్వతాలు, నరసింహులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించి పాఠశాలలను బలోపేతం చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న



భోజన్నను సన్మానిస్తున్న నీపీఎస్ యూనియన్ ప్రతినిధులు

జనగామ, మే 24 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించి ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న పేర్కొన్నారు. మరోవైపు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ బాలుర ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్, మండల విద్యాశాఖ అధికారి గురిజాల శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్ సర్వీస్ టీచర్స్ ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని శనివారం డీఈవో సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థులను ఉత్తమ భారత పౌరులుగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతిలోని విద్యార్థులకు అందజేసి ఆశించిన అభ్యసన ఫలితాలు పొందేందుకు అంకితభావంతో పనిచేయాలని కోరారు. తాను కూడా మారుమూల ప్రాంతంలో పుట్టి ప్రభుత్వ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రాథమిక ,ఉన్నత విద్యను పూర్తి చేసి ఈస్థాయికి వచ్చానని గుర్తుచేశారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రోత్సహించిన టీచర్లను విద్యార్థులు తప్పనిసరిగా గుర్తుంచుకుంటారని, తాను విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రాథమిక విద్యను అందించిన గురువుల వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్న తర్వాతనే బాధ్యతలు చేపట్టానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆర్పీలు పరశురామన్, బొగ్గారపు శ్రీనివాస్, ఇంగ్లిష్ ఆర్పీలు నిమ్మ రాంరెడ్డి, రేణిగుంట్ల మురళి, గణిత ఆర్పీలు చట్ల సాంబరాజు, వంగ సంతోష్‌కుమార్, పరిసరాల విజ్ఞానం ఆర్పీ శాడ రవి, నవీన్‌కుమార్, సీఆర్పీలు రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

డీఈవో భోజన్నకు ఘన సన్మానం

జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన భోజన్నను శనివారం క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో తెలంగాణ స్టేట్ నీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ నీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి, ప్రధాన కార్యదర్శి మేడ మనోజ్‌కుమార్, కోశాధికారి బెజ్జం సునీల్‌కుమార్, అంజయ్య, శేషు కుమార్, రజిత కుమారి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాలు మొలకెత్తేందుకు వినియోగిస్తున్న డ్రిప్

పత్తి విత్తనాలు మొలకెత్తేలా భగీరథ యత్నం

రేగడితండాలో డ్రిప్‌ను వినియోగిస్తున్న రైతు

జఫర్‌గఢ్, మే 24 : పత్తి విత్తనాలు మొలకెత్తేందుకు ఓ రైతు డ్రిప్‌ను వినియోగిస్తున్న వైనం మండలంలోని రేగడితండాలో నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు రేగడితండాకు చెందిన రైతు ధరంసోత్ యాకూబ్ మూడెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. అయితే సరైన తేమ లేక పోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో తనవద్ద ఉన్న డ్రిప్ పరికరాలతో బిందు సేద్యం చేపట్టాడు. దీనిని కొనసాగిస్తే విత్తనాలు మొలకెత్తుతాయని యాకూబ్ తెలిపాడు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు డ్రిప్‌పై రైతులకు అవగాహన కల్పించి, పరికరాలకు నూరు శాతం సబ్సిడీ అందించాలని కోరాడు. వర్షాభావంతో భూగర్భ జలాలు తగ్గడంతో సాగునీటి సమస్య నెలకొందని, ఈ క్రమంలో బిందు సేద్యం పంటల సాగుకు దోహదపడుతుందన్నాడు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం : ఎంఈవో

ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎంఈవో కళావతి

దేవరుప్పుల, మే 24: ప్రభుత్వ పాఠశాలలు సమర్థవంతంగా నడవాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం, సమాజ మద్దతు అవసరమని మండల విద్యాధికారి జీ కళావతి అన్నారు. మండలంలోని చినమడూరు ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా శిబిరం ముగింపు సమావేశం శనివారం జరిగింది. కళావతి మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణతో తెలుగు, గణితం, ఆంగ్లం, ఈవీఎస్ అంశాలపై ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారని తెలిపారు. శిక్షణలో చురుగ్గా వ్యవహరించిన ఉపాధ్యాయులు జహంగీర్, ప్రతాప్, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కీమా, అంజయ్య, ఆర్సీలు, ఎంఆర్‌సీ సిబ్బందిని ఎంఈవో కళావతి సన్మానించి ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పద్మావతి, లలిత, రమాదేవి, రమేశ్, శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

జఫర్‌గఢ్, మే 24 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండలంలోని సూరారానికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారి రాజు కోరారు. జఫర్‌గఢ్‌లోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమావేశానికి ఎంఈవో రఘునందన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన జూమ్ మీటింగ్‌లో రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. తనకు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఎంఈవో రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఆర్పీలు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారన్నారు.

విద్యాబోధనలో మెళకువలు పాటించాలి

శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చిల్పూరు, మే 24 : తరగతి గదుల్లో పాఠాలను బోధించేప్పుడు మెళకువలు పాటించాలని ఎంఈవో దాసరి గోవర్ధన్ అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా నాణ్యమైన బోధన అందించాలరు. ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ శిబిరం నిర్వహించిన సందర్భంగా శనివారం ఎంఈవో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీలు జీ వేణుగోపాల్, రమాదేవి, అశోక్, వేణు, అనుజ, కల్యాణి, రాజబాబు, కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత

ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రఘునాథపల్లి, మే 24: మండలంలోని మండెలగూడేనికి చెందిన లింగరబోయిన భాస్కర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి స్నేహితులు, పూర్వ విద్యార్థులు శనివారం భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. మృతుడి కుమార్తె అశ్విని పేర పోస్టాఫీసులో డిపాజిట్ చేసిన రూ.లక్ష విలువైన బాండ్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. స్నేహితులు మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితుడు మృతి బాధాకరమని, కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, మస్సి చంద్ర మౌళి, దుడుక హరిప్రసాద్, కావటి కుమార్, కొంగరి కృష్ణ, రమాదేవి, ప్రవీణ్‌కుమార్, ఉమారాణి, భవాని, స్వామి పాల్గొన్నారు.

స్తంభాల మార్పిడి ఖర్చును ప్రజలే భరించాలి

స్థానికులత